క్లుప్తంగా

బీఆర్‌ఎస్ నేత కౌశిక హరి అరెస్ట్



అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గోదావరిఖని: బీఆర్‌ఎస్ నేత కౌశిక హరిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు సింగరేణి స్టేడియానికి వెళ్లగా గోదావరిఖని వన్‌టౌన్, ఎన్టీపీసీ సీఐలు ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ అక్కడకు చేరుకుని అరెస్ట్ చేశారు. బూడిద వ్యవహారాన్ని పరిశీలించేందుకు కుందనపల్లి యాష్‌పాండ్ వద్దకు వెళ్తున్నారన్న సమాచారంతో ముందస్తు అరెస్ట్ చేసి జైపూర్ పోలీస్‌స్టేషన్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ అరెస్టులతో నిజాన్ని దాచలేరు



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: బీఆర్‌ఎస్ నేత కౌశిక హరి అరెస్ట్‌తో అధికార పార్టీ అవినీతిని అంగీకరించినట్లేనని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి అన్నారు. గోదవరిఖనిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామగుండం ఎన్టీపీసీలో బూడిద అక్రమ రవాణాపై నిజనిర్ధారణకు ఎల్రక్టానిక్ మీడియాతో కలిసి బయలు దేరడానికి సిద్ధమైన క్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరిని పోలీసులు అరెస్టు అన్యాయమన్నారు. బూడిద దందా ద్వారా రూ.కోట్లు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. అక్రమ అరెస్టులతో నిజాన్ని దాచిపెట్టలేరని, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కాంగ్రెస్ తీరును ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్లపల్లి రవి, జేవీరాజు, మాదాసి శ్రీనివాస్, ఉప్పు కుమార్, తదితరులు ఉన్నారు.

కౌశిక హరి అరెస్టుపై ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

రామగుండం: పాలకుర్తి మండల పరిధిలోని ఎల్కలపల్లి గ్రామ శివారు నుంచి ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిద అక్రమ రవాణా పరిశీలించడానికి శనివారం వెళ్తున్న బీఆర్‌ఎస్ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రతినిధి కౌశిక హరిని రామగుండం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి మంచిర్యాలలోని జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీన్ని నిరసిస్తూ అంతర్గాం జంక్షన్‌లో కౌశిక హరి అనుచరులు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. గాలెంకి ప్రసాద్, దొబ్బల తిరుపతి, ఒల్లెపు మల్లేశ్, ప్రశాంత్‌గౌడ్, అరవింద్, శంకర్‌నాయక్, నక్క రాజయ్యయాదవ్, దుర్గం శంకర్, కిషోర్, అరుముళ్ల కుమార్ ఉన్నారు.

ప్లాస్టిక్ అమ్మకాలు నిలిపివేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ నియాజ్

సుల్తానాబాద్: వాతావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసుల అమ్మకాలను వ్యాపారాలు వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ ఆదేశించారు. పట్టణంలోని ప్లేట్ల తయారీ, దుకాణ యజమానులకు శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేయాలని, జనపనార సంచులు విక్రయించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించడంతో పాటు దుకాణ లైసెన్సు రద్దు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, విక్రయదారులు పాల్గొన్నారు.

ఫీజుల పేరిట విద్యార్థులను వేధిస్తే ఊరుకోం

గోదావరిఖనిటౌన్: ప్రైవేయిట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరిట విద్యార్థులను వేధిస్తే ఊరుకోమని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజులు చెల్లించాలని విద్యార్థులను అవమానపరిచేలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే పాఠశాలల ఎదుట ఆందోళన చేస్తామని ఆయన పేర్కొన్నారు.

చెట్ల కిందే ప్రయాణికుల పాట్లు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సు కోసం అంబేడ్కర్ చౌరస్తాలో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, పిల్లాపాపలతో ఇబ్బందులు పడుతున్నారు. బస్సు వచ్చే వరకు చెట్లనీడన నిలబడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు ఇదే విధమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో కనీసం చెట్ల నీడ లేక ఎండలోనే ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, పాలకులు పట్టించుకుని ఆయా ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.



బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం

ధర్మారం: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో విప్ శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఉపాధ్యాయులను నేరుగా కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్‌రెడ్డికి వేయాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, నాయకులు అరిగే లింగయ్య, గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, సోగాల తిరుపతి, సంతోష్, దేవి జనార్దన్, ఓరం చిరంజీవి తదితరులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ముగిసిన కుష్ఠు సర్వే.. తేలిన లెక్క

- 42 మందికి వ్యాధి నిర్ధారణ
- మందులు అందజేస్తున్న వైద్యారోగ్యశాఖ

సుల్తానాబాద్: కుష్ఠురహిత సమాజంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. 2030 వరకు దేశంలో కుష్ఠును పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నా కేసులు తగ్గకపోగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వైద్యారోగ్యశాఖ గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేకంగా సర్వే నిర్వహించింది. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు.

అనుమానితుల గుర్తింపు

కుష్ఠు అనుమానితులను గుర్తించేందుకు వైద్యారోగ్యశాఖ చేపట్టిన ప్రత్యేక సర్వేలో 42మందికి వ్యాధి నిర్ధారణ అయింది. జిల్లావ్యాప్తంగా 8 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అందులో పని చేసే 247 మంది ఏఎన్‌ఎంలు, 495 మంది ఆశావర్కర్లు, 107 మంది సూపర్‌వైజర్లు సర్వే చేపట్టారు. జిల్లాలో 1,99,877 మంది ఇళ్లను సందర్శించారు. గతేడాది డిసెంబర్ 31వ తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 13 వరకు ఇంటింటా సర్వే నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 798 మంది అనుమానితులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వారందరికీ పరీక్షలు నిర్వహించగా 42 మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. జిల్లాలో 2022లో 42కేసులు, 2023లో 59కేసులు, 2024–25 ఫిబ్రవరి 15 వరకు 42 కేసులు నమోదయ్యాయి.



అనుమానితులను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్లు

అనుమానితులను గుర్తించాం



ప్రతీ ఏటా అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యాధి వ్యాప్తి జరగకుండా ప్రాథమిక దశలో గుర్తించి నియంత్రణకు కావాల్సిన పరీక్షలు నిర్వహిస్తూ మందులు అందజేస్తున్నాం. పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి మందులు పంపిణీ చేస్తున్నాం. కోలుకునేందుకు కావాల్సిన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి.
– సుధాకర్ రెడ్డి, లెప్రసీ ప్రోగ్రాం జిల్లా అధికారి, పెద్దపల్లి

కుష్ఠు అంటువ్యాధి

కుష్ఠు సోకిన వారికి మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా వ్యాధిని నయం చేస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి మల్టీబాసిల్లరీ(ఎంబీ) కేసులో తక్కువ తీవ్రత వ్యాధి ఉన్నవారికి 6నెలల కోర్సు, పాసిబాసిల్లరీ(పీబీ) వ్యాధి తీవ్రత ఎక్కువగా నమోదైన వారికి 12 నెలల పాటు ఔషధాలు వాడాల్సి ఉంటుంది.

సంక్షిప్త వార్తలు

• నర్సరీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

గోదావరిఖని: సింగరేణి సంస్థవ్యాప్తంగా నర్సరీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. సంస్థవ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసేలా అన్ని ఏరియాల జీఎంలు చొరవ తీసుకోవాలని ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన వేతనాలు అమలులో రావాలని సూచించారు.

• బైక్‌ను ఢీకొన్న లారీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెకు చెందిన చిలుముల చంద్రయ్య ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం తన బైక్‌పై విధులకు వెళుతున్న క్రమంలో ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ రాజీవ్ రహదారిపై కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నది. ఈక్రమంలో చంద్రయ్యకు తీవ్రగాయాలు కావడంతో ఎన్టీపీసీ ఏఎస్సై బుచ్చిన్ననాయుడు తన సిబ్బందితో చంద్రయ్యను ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చంద్రయ్యను మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు కరీంనగర్‌కు తీసుకెళ్లారు. ఎన్టీపీసీ పోలీసులు ప్రమాద సంఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

• అదనపు కలెక్టర్, మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోండి

గోదావరిఖనిటౌన్: బ్రాందీ షాపుల కోసం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద గల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. శనివారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను మంచిర్యాల జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఆఫీసు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం కూడా కూల్చివేసే కుట్రలు జరుగుతున్నాయని, విగ్రహాన్ని కూల్చి వేయకుండా చూడాలని వారు ఎంపీకి విన్నవించారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, నాయకులు కొంకటి లక్ష్మణ్, మైస రాజేశ్, కాంపెల్లి సతీశ్, మంతెన లింగయ్య, ఇరుగురాల కిష్టయ్య, గద్దల శోభిభూషణ్, బూడిద మహేందర్ ఉన్నారు.

• ఇటుక బట్టీలకు ఉచితంగా ఎన్టీపీసీ బూడిద

పెద్దపల్లిరూరల్: ఇటుక బట్టీలకు ఎన్టీపీసీ యాజమాన్యం యాష్ ఉచితంగానే అందిస్తోందని పెద్దపల్లి ప్రాంత ఇటుక బట్టీల యాజమాన్య సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంఎస్‌ఎం ద్వారా 114 యూనిట్ల యాష్ ఉచితంగా ఇటుకబట్టీలకు ఇచ్చేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం అంగీకరించడంతో యాష్ వాడుతున్నామని పేర్కొన్నారు. సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సిద్దయ్య, కొండయ్య, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

• కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను సవరించాలి

మంథని: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో కార్మికులు, కర్షకులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని, బడ్జెట్‌ను సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ఆరోపించారు. మంథని మున్సిపాలిటీ శనివారం ఆవరణలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం చేయాలనే డిమాండ్‌ను పక్కనపెట్టి కార్మిక రంగాన్ని వ్యవసాయ రంగాన్ని, కూలీల బతుకులను కూనీ చేసిందని విమర్శించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతి, సీఐటీయూ నాయకులు రాజు, శ్రీనివాస్, కిష్టయ్య ఉన్నారు.

• ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

జూలపల్లి: మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయినట్లు తహసీల్దారు స్వర్ణ తెలిపారు. 27న స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇందులో 1198 మంది పట్టభద్రులు, 13 మంది టీచర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. రెండు పోలింగ్ బూత్‌లలో ఇద్దరు ప్రిసైడింగ్ అధికారులు, ఆరుగురు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని, పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు, తాగునీటి సౌకర్యం కల్పించినట్లు వివరించారు.

ఓదెలలో..

ఓదెల: మండలంలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాస్‌గౌడ్ శనివారం పేర్కొన్నారు. మండలంలో 1796 పట్టభద్రులు, 50మంది టీచర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓదెల హైస్కూల్లో రెండు పోలింగు బూత్‌లు ఉన్నాయన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

బెడెన్ పావెల్ జయంతి



మాట్లాడుతున్న కిరణ్‌బాబు

గోదావరిఖని: స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెడెన్ పావెల్ జయంతిని స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్ సమీప పార్క్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ స్వామి, బ్రాంచ్ సెక్రటరీ అరెల్లి పోశం, సీనియర్ పీవో హనుమంతరావు, ప్రతినిధులు రంగు శ్రీనివాస్, గట్టుమల్లు, కె.బుచ్చయ్య, ఎ.దేవేందర్, కుమార్, రాజయ్య, సాంబయ్య, స్వర్ణలత పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కొమురయ్య

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రి డిగ్రీ కాలేజీలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధాంతాలు కలిగిన బీజేపీ నుంచి పోటీ చేస్తున్న తాను పార్టీలు, జెండాలు మార్చే ప్రసక్తే లేదన్నారు. టీచర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడతానని, తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓయూ జేఏసీ మద్దతు



ప్రచారంలో ఓయూ జేఏసీ నాయకులు

సుల్తానాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని నిలబెట్టిన బీజేపీకి ప్రతీ ఉపాధ్యాయుడు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరాం కోరారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బీసీ అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రేంకుమార్, తిరుపతి, సాయి, శాంతకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ కోరారు. మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం ఓటర్లను కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. బ్యాలెట్ నమూనాలో రెండో నంబర్‌లో ఉన్న నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, వైస్‌చైర్మన్ రాజమల్లు, మాజీ సర్పంచ్ మదాసి, దేవేందర్, సతీశ్, కోఆర్డినేటర్ మల్లేశ్, రామచంద్రం, రవి, రమేశ్, మొండయ్య, శివరామకృష్ణ, శ్యామ్, మధు, క్రాంతి, సునీల్‌రావు ఉన్నారు.

గూడెంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ఓదెల: మండలంలోని గూడెం గ్రామంలో బాలవికాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్‌ప్లాంట్‌తో ప్రస్తుతం గ్రామంలో మంచినీటి సమస్య తీరుతుందన్నారు. వాటర్ ప్లాంట్ కోసం రూ.లక్ష విరాళం ఇచ్చిన బండారి ప్రమీలను ఆయన అభినందించారు. ఓదెల మాజీ జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న మనోహర్‌రెడ్డి



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని నూతుల కుంట వద్ద గతంలో ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక నిరుపయోగంగా మారింది. దారి లేకపోవడంతో పాటు చెట్లు, ముళ్లపొదలతో నిండిపోయింది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత

గోదావరిఖని: గతేడాది మేలో జీడీకే–11గనిలో జరిగిన గని ప్రమాదంలో ఎల్‌హెచ్‌డీ ఆపరేటర్ ఇజ్జగిరి ప్రతాప్ మృతి చెందాడు. కాగా అతడి కుటుంబానికి మ్యాచింగ్ గ్రాంట్ చెక్కును ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ శనివారం అందజేశారు. జీఎం కార్యాలయంలోని జీఎం చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో మృతుడి భార్య ఇజ్జిగిరి రాజేశ్వరి, కుటుంబ సభ్యులకు రూ.20.57లక్షల విలువైన చెక్కును అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మడ్డి ఎల్లయ్య, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, బ్రాంచి సెక్రటరీ ఆరెల్లి పోషం పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జీఎం లలిత్‌కుమార్

ఆపరేషన్స్ డైరెక్టర్‌కు సన్మానం

గోదావరిఖని: సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణను ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ ఘనంగా సన్మానించారు. సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి శనివారం జీఎం కార్యాలయానికి వచ్చిన సందర్భంగా సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో క్వాలిటీ జీఎం భైద్యా, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, అధికారులు కిరణ్‌బాబు, చంద్రశేఖర్, సాయిప్రసాద్, చిలక శ్రీనివాస్, రమేశ్, ఆంజనేయప్రసాద్, శివనారాయణ, కుమారస్వామి, భాస్కర్, హనుమంతరావు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న జీఎం లలిత్‌కుమార్

ఏపీఏలో డైరెక్టర్ పర్యటన

రామగిరి: అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో శనివారం ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు పర్యటించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టి ఏపీఏ గనికి వచ్చిన సందర్భంగా ఏపీఏ అధికారులు ఆయనను సన్మానించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రాజెక్టుకు సంబంధించిన సాల్వేజింగ్ పనులు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్‌వోటూ జీఎం బండి సత్యనారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు రాజేంద్రకుమార్, టి.రఘురాం, పి.డి.సుధాకర్, షబ్బీరుద్దీన్, రాజేశం, మతీన్ హుస్సేన్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఏపీఏ అధికారులు

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

గోదావరిఖనిటౌన్: గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. శనివారం ఆమె స్థానిక మహర్షి డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మేరుగు హనుమంతుగౌడ్, రామగుండం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి గుండబోయిన భూమయ్య, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి మచ్చ విశ్వాస్, కోడూరు రమేశ్, జక్కుల పద్మ, ప్రవీణ్ పాల్గొన్నారు.

జూలపల్లి మండలంలో..

జూలపల్లి: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ కోరారు. మండలంలోని కుమ్మరికుంటలో శనివారం నాయకులతో కలిసి ఓటర్లను కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. అబ్బాపూర్‌లో పార్టీ సీనియర్ నాయకులు అమరగాని ప్రదీప్‌కుమార్ ప్రచారం చేశారు. నాయకులు పొన్న వెంకటేశ్, బండారి శ్రీకాంత్, సంపత్, గనవేని అజయ్, నవీన, కొత్త మహేశ్ పాల్గొన్నారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న కందుల సంధ్యారాణి

కొలనూర్ రైల్వేస్టేషన్‌లో తిరుపతి రైలు ఆపాలి

ఓదెల: మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్‌లో తిరుపతి రైలును ఆపాలని కొలనూర్ మాజీ సర్పంచ్ మాటూరి వెంకటస్వామి కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలును కొలనూర్‌లో ఆపితే భక్తులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాలకు చెందిన ప్రయాణికులు కొలనూర్ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణం చేస్తారని వినతిపత్రంలో వివరించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు మాజీ సర్పంచు తెలిపారు.